క్లుప్తంగా

అభయాంజనేయ స్వామికి విశేష పూజలు



అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ముమ్మిడివరం: స్థానిక పోలమ్మ చెరువు గట్టున కొలువైన అభయాంజనేయ స్వామి ఆలయ 13వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ నేమాని జగన్మోహన్ సవిత దంపతులు ఆలయ అర్చకుడు సుదర్శనం శ్రీరామ చిరంజీవి ఆచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారికి విశేష పూజలు, సువర్చలా ఆంజనేయ స్వామికి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువకుడి మృతి

అల్లవరం: గూడాల పంచాయతీ పరిధి సాకవారిపేటకు చెందిన యువకుడు జల్లి రాజేష్ (24) గుండెపోటుతో మృతిచెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్నేహితులతో కలసి మద్యం తాగి డీజే బాక్సుల వద్ద డ్యాన్సులు చేశాడు. రాజేష్ మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న రాజేష్‌ని పేరూరులోని ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కిమ్స్‌కు తరలించారు. రాజేష్‌ని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. పరిమితికి మించిన డీజే సౌండ్స్ కారణంగా రాజేష్ మృతి చెందాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. మృతుడుకి తల్లి, తండ్రి, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన



అమలాపురంలో అగ్ని ప్రమాదాల నియంత్రణపై పోస్టర్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

అమలాపురం టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం అమలాపురం అగ్నిమాపక దళం పట్టణంలోని పలు కూడళ్లలో ప్రమాదాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. పలు రకాల వాహన చోదకులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై అగ్నిమాపక శాఖ ముద్రించిన వాల్‌పోస్టర్లను సిబ్బంది పంపిణీ చేశారు. అమలాపురం అగ్నిమాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరు, హైస్కూలు సెంటరు, సీఎంఆర్ షాపింగ్ మాల్, ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించి, వాల్‌పోస్టర్లు పంపిణీ చేశారు. లీడింగ్ ఫైర్‌మెన్ మట్టపర్తి బలరామ్, సిబ్బంది ప్రమాదాల నివారణపై ప్రయోగాత్మక చర్యలను చేసి చూపించి అవగాహన కల్పించారు.

యానాం అభివృద్ధికి పూర్తి సహకారం



ఎంపీ హరీష్‌మాధుర్‌ను సత్కరిస్తున్న మల్లాడి

యానాం: అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి సరిహద్దున ఉన్న కేంద్ర పాలిత ప్రాంతం యానాం అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన్ భవన్ వద్ద అంబేడ్కర్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గిడ్ల చంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన అంబేడ్కర్ జయంత్యుత్సవంలో ఆయన ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హరీష్‌మాధుర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, మాజీ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, బడుగు బలరామ్, రిటైర్డ్ అధికారులు లంక విద్యాసాగర్, గూటం శివగణేష్, పొలిమారి సత్యనారాయణ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

తాళ్లరేవు: తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రధానంగా మండల పరిధిలోని మత్స్యకార గ్రామాలకు నీటి ఎద్దడి కలుగకుండా తాళ్లరేవు–2 పథకంలో భాగంగా కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం మంచినీటి చెరువుకు విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసారు. నీటిని తోడేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి ఆరు మోటార్లతో నీటిని సరఫరా చేస్తున్నట్లు కాంట్రాక్టరు శ్రీనివాసరావు తెలిపారు.

నీటి చౌర్యం.. నివారణ చర్యలు శూన్యం

- కుళాయిలకు అక్రమంగా విద్యుత్ మోటార్లు
- శివారు ప్రాంతాల్లోని ప్రజలకు అందని తాగునీరు
- చోద్యం చూస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు



కుళాయికి అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మోటారు



తాగునీరు రాక అండర్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కుళాయి

అల్లవరం: గ్రామీణ రక్షిత మంచినీటి పథకం ద్వారా ప్రతి వ్యక్తికి 55 లీటర్ల శుద్ధి చేసిన తాగునీటిని పబ్లిక్ కుళాయి ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ చేరాలన్న గత ప్రభుత్వాల సంకల్పం నేడు నీరుగారుతోంది. మాజీ ఎంపీ కేఎస్ఆర్ మూర్తి సంకల్పంతో రూరల్ వాటర్ స్కీమ్ అల్లవరం మండలంలో గుండెపూడి, ఉప్పలగుప్తం మండలంలో చల్లపల్లి, అమలాపురం రూరల్ పరిధిలో పేరూరులో తొలి విడతగా రూరల్ వాటర్ స్కీమ్ అమల్లోకి వచ్చింది. ఈ పథకం ద్వారా ప్రతి 250 మందికి పంచాయతీ తీర్మానం ద్వారా పబ్లిక్ కుళాయిని ఏర్పాటుచేసి ప్రతి రోజు పుష్కలంగా రక్షిత నీటిని అందించారు. అయితే అప్పట్లో ఈ స్కీమ్ నిర్వహణపై ఉన్న శ్రద్ధ నేడు కొరవడింది.

ఇంటింటికీ అనధికార కుళాయిలు

పాలకులు తమ స్వార్థం కోసం ఇంటింటికీ అనధికార కుళాయిలకు అనుమతులివ్వడంతో పబ్లిక్ కుళాయిల స్థానంలో అనధికార కుళాయిలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. గ్రామాల్లో పాలకులను ఏమీ అనలేక అనధికార కుళాయిలను అడ్డుకోవడంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు విఫలమయ్యారు. దీంతో అనధికార కుళాయిలకు విద్యుత్ మోటార్లు వెలిశాయి. ఇంటికో కుళాయి, ఆ కుళాయి విద్యుత్ మోటారు ఏర్పాటు చేశారు. అధినకారికంగా కుళాయిలు ఏర్పాటు చేయడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా వాటికి కొందరు విద్యుత్ మోటార్లను అమర్చారు.

రెండు గ్రామాల్లో 600 పైగా మోటార్లు

అల్లవరం మండలంలో దేవగుప్తం, డి.రావులపాలెంలో అనధికారిక కుళాయిలు కోకొల్లలుగా ఉన్నాయి. ఈ రెండు గ్రామాల్లో పంచాయతీ తీర్మానం ద్వారా ఏర్పాటుచేసిన ఒక్క పబ్లిక్ కుళాయి మచ్చుకైనా కనపడదు. అనధికార కుళాయిలకు విద్యుత్ మోటార్లు అమర్చి వినియోగిస్తున్నారు. ఈ రెండు గ్రామాల్లో 600 పైగా విద్యుత్ మోటార్లున్నాయి. ఈ రెండు గ్రామాల్లో ప్రాంతాల వారీగా రెండు రోజులకు ఒకసారి తాగునీరు పంపిణీ చేస్తున్నారు. నీటి విడుదల చేసిన వెంటనే విద్యుత్ మోటార్లు ఆన్‌చేసి తాగునీటిని అవసరాలకు మించి వాడేస్తున్నారు. దీంతో శివారు కుళాయిల నుంచి కనీసం బిందె నీళ్లు రాని పరిస్థితి. ఇంత జరుగుతున్నా పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదు. అనధికార కుళాయిలకు ఉన్న విద్యుత్ మోటార్లను తొలగించి పూర్తి స్థాయిలో తాగునీరు పంపిణీ చేయడంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు విఫలమవుతున్నారు. ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లను ఆనుకుని ఉన్న కుళాయిలకు విద్యుత్ మోటార్లు ఏర్పాటుచేసిన వారిపై చర్యలు తీసుకోవడంలోనూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

ఉదయం వేళలో విద్యుత్ కోత

అనధికార కుళాయిలకు ఉన్న విద్యుత్ మోటార్లను తొలగించలేక ఉదయం వేళల్లో విద్యుత్ కోత విధించి నీటిని పంపిణీ చేస్తున్నారు. అనధికార విద్యుత్ కోతల కారణంగా ఆక్వా సాగుపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది సహకారంతోనే అనధికార కుళాయిలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సిబ్బంది పనితీరుపై ఉన్నత స్థాయి అధికారులు నిఘా లోపించడంతో గ్రామాల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శివారు ప్రాంతాల కుళాయిలకు పూర్తిస్థాయిలో తాగునీరు పంపిణీ కావాలంటే కుళాయిలకు అమర్చిన విద్యుత్ మోటార్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

నోటీసులు జారీ చేస్తున్నాం

దేవగుప్తం, డి.రావులపాలెం గ్రామాల్లో అనధికార కుళాయిలకు విద్యుత్ మోటార్లు ఉన్న మాట వాస్తవమే. డి.రావులపాలెంలో ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. దేవగుప్తంలో మరో రెండు రోజుల్లో నోటీసులు జారీ చేస్తాం. ఎన్ని విద్యుత్ మోటార్లు ఉన్నాయో గుర్తించి పంచాయతీ కార్యదర్శి ద్వారా నోటీసులు ఇస్తాం. నోటీసులు ఇచ్చినా తొలగించకపోతే పోలీసులు సహకారంతో విద్యుత్ మోటార్లు తొలగిస్తాం.

– స్వామి, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, అల్లవరం

హాస్టళ్లకు సీలింగ్ ఫ్యాన్ల పంపిణీ



సీలింగ్ ఫ్యాన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌బీఐ అధికారులు

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) రీజనల్ కార్యాలయం ద్వారా అమలాపురంలోని సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన బాలికల హాస్టళ్లకు సీలింగ్ ఫ్యాన్లు, నిత్యావసర వస్తువులను సమకూర్చినట్టు రీజనల్ మేనేజర్ ఎంవీవీఎమ్ కృష్ణ తెలిపారు. ఎస్‌బీఐ సీఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా హాస్టల్ విద్యార్థులకు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీలింగ్ ఫ్యాన్లను మంగళవారం అందజేసినట్టు ఆయన తెలిపారు. స్థానిక బాలికల హాస్టల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ సందీప్ సాగర్ పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

ముమ్మిడివరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గతంలో స్కూల్ అసిస్టెంట్‌గా సేవలందించిన దివంగత బండారు రాజ్యలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె భర్త మీసాల వెంకటరమణ రూ.పదివేల విలువైన ప్రింటర్‌ను మంగళవారం హెచ్‌ఎం బి. హనుమంతరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మిరియం బీబీ ఎస్ రాంబాబు, కే రాజబాబు, బి.సుబ్బారావు సీఆర్‌పీ శ్రీనుబాబు చంద్రరావు పాల్గొన్నారు.

జగ్గిరెడ్డిని కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ఉప్పలగుప్తం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని పార్టీ అధిష్టానం నియమించడంపై మండలానికి చెందిన పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గోపాలపురంలో ఆయన నివాసంలో జగ్గిరెడ్డిని మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే రమణారావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, సర్పంచ్‌లు యర్రంశెట్టి రామచంద్రరావు, పెయ్యిల రాజ్ కుమార్, కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ, ఊటాల రామాంజనేయులు, నేలపూడి సుగంధ కుమార్, జొన్నాడ చిన్ని, పందిరి సుబ్బరాజు, పోలిమాటి రామకృష్ణ తదితరులు జగ్గిరెడ్డిని గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ బలోపేతం దిశగా అడుగులు వేయాలి



ఉప్పలగుప్తంలో మాట్లాడుతున్న ఎంపీపీ దంగేటి అచ్యుత జానకి

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ బలోపేతం దిశగా పార్టీ శ్రేణులు అడుగులు వేయాలని, రాబోయే ఎన్నికల్లో పార్టీ అధికారం చేపట్టే దిశగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకులను, కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారని ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి అన్నారు. ఉప్పలగుప్తంలో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులుగా, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్‌ను పార్లమెంటరీ సమన్వయకర్తగా, యువ నాయకుడు శ్రీకాంత్‌ను అసెంబ్లీ సమన్వయకర్తగా పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి నియమించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, పార్టీ ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, ఉప సర్పంచ్ మోకా శ్రీను, నాయకులు సలాది సతీష్, చప్పిడి దుర్గారావు, ఊటాల రామాంజనేయులు, వెంకటేష్ పాల్గొన్నారు.

సర్పంచ్‌కు ఘన సత్కారం



విలసవిల్లిలో సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి, సతీష్ దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: విలసవిల్లి గ్రామ పంచాయతీ పరిధి భీమ్‌నగర్‌లో అంబేడ్కర్ జయంతి సందర్భంగా సర్పంచ్ సలాది ఊర్మిళ దేవి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ దంపతులను మంగళవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా దళితులు నివసించే భీమ్ నగర్ ప్రాంతానికి రోడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఊర్మిళాదేవికి సర్పంచ్ ఎన్నికల ముందు తెలియజేశామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం భీమ్ నగర్ ప్రాంతానికి సర్పంచ్ సీసీ రోడ్లు నిర్మించారని వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వడ్డీ గోపాలకృష్ణ, వజ్రపు లారెన్స్, మెట్టి శ్రీను, బల్ల మరిడేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ముమ్మిడివరం యువకుడి ఎంపిక

ముమ్మిడివరం: రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలో ముమ్మిడివరం హెల్దీలైఫ్ జిమ్ స్టూడెంట్స్ సత్తా చాటారు. ఇటీవల కృష్ణా జిల్లా గుడివాడలో నిర్వహించిన స్టేట్ లెవెల్ పవర్ లిఫ్టింగ్ పోటీలో దొమ్మేటి వేణుసాగర్ సబ్ జూనియర్ 105 కేజీల విభాగంలో రజత పతకం, బెంచ్‌ప్రెస్‌లో కాంస్య పతకం సాధించి మే నెల 19న మహారాష్ట్ర కొల్హాపూర్‌లో నిర్వహించే నేషనల్ పవర్ లిఫ్టింగ్‌కి అర్హత సాధించాడు. 93 కేజీల సబ్ జూనియర్ విభాగంలో దున్నా రామ్‌చరణ్‌దేవ్, 55 కేజీలో చిటికెన శ్రీనివాస్ కౌశిక్ కాంస్య పతకాలు సాధించారని కోచ్ వాసంశెట్టి నరేష్ మంగళవారం తెలిపారు. విజేతలను సీహెచ్ గున్నేపల్లి, సర్పంచ్ గొలకోటి దొరబాబు, డాక్టర్లు విజయ్‌కిరణ్, దుర్గా తేజ అభినందించారు.

పవర్ లిఫ్టింగ్ విజేత కిరణ్‌కుమార్

అమలాపురం టౌన్: కృష్ణా జిల్లా గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 11,12,13 తేదీల్లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్ పోటీల్లో అమలాపురం జీకే ఫిట్‌నెస్ జిమ్ పవర్ లిఫ్టర్ చీకురుమిల్లి కిరణ్‌కుమార్ విజేతగా నిలిచారు. ఈ పోటీల్లో మాస్టర్ 74 కేజీల విభాగంలో బెంచ్ ప్రెస్‌లో 2వ స్థానం, పవర్ లిఫ్టింగ్‌లో 3వ స్థానం సాధించారు. ఈ సందర్భంగా స్థానిక జిమ్‌లో మంగళవారం ఉదయం నిర్వహించిన అభినందన సభలో విజేత కిరణ్‌కుమార్‌ను జిమ్ ప్రతినిధులు, క్రీడాకారులు డి.గోపికృష్ణ, డాక్టర్ కాండ్రేగుల శ్రీధర్, డాక్టర్ కడలి ప్రసాద్ తదితరులు అభినందించారు.

రాత పరీక్షకు హాల్ టికెట్లు సిద్ధం

యానాం: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ (టైర్–1) పోస్టుల భర్తీకి ఈనెల 27న ఆదివారం రాత పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో అభ్యర్థులు తమ హాల్ టికెట్లను ఈనెల 16నుంచి వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని మంగళవారం డీపీఅండ్ఆర్ (ఎగ్జామ్ సెల్) సెక్రటరీ వి జయశంకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు 'రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, వివరాల కోసం 0413–2233338 నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు.

రహదారిపై కొబ్బరి డొక్కలతో ప్రమాదాలు



తాళ్లరేవు సహకార సంఘ భవనం వద్ద రహదారిపై వేసిన కొబ్బరి డొక్కలు

తాళ్లరేవు: ప్రధాన రహదారిపై పలువురు కొబ్బరి డొక్కలు వేయడంతో తాళ్లరేవులో పలువురు వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. స్థానిక సచివాలయం–2 సమీపంలోని సహకార సంఘ భవనం వద్ద ప్రతిరోజూ కొబ్బరి డొక్కలను రహదారిపై వేయడంతోపాటు వాటిని నీటితో తడుపుతున్నారు. దీంతో వేగంగా వచ్చే వాహనదారులు ఆ డొక్కలపై నుంచి వెళ్లడంతో జారిపడి గాయాలపాలవుతున్నారు. కొబ్బరి తాడు వ్యాపారం చేసుకునే వారు డొక్కలను ప్రతిరోజూ రహదారిపై వేస్తున్నారు. అధికారులు దృష్టిసారించి రహదారిపై కొబ్బరి డొక్కలు వేయకుండా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

విద్యార్థినికి సత్కారం

ఉప్పలగుప్తం: ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో 971 మార్కులతో మండల ప్రథమస్థానం సాధించిన ఎస్.కొత్తపల్లికి చెందిన విద్యార్థిని గోసంగి రమ్యశ్రీను మండల మాల జేఏసీ నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కుంచే బాబులు, డీఆర్‌డీఏ ఏపీఎం అయితాబత్తుల సురేంద్ర, తాళ్ల రవి, దేవరపల్లి వెంకటేశ్వరావు, గిడ్ల రమేష్, నల్లా వెంకన్నబాబు పాల్గొన్నారు.

వ్యాపారి మృతికి సంతాపం

యానాం: పట్టణంలో ప్రముఖ వ్యాపారి సుంకర సుబ్బారావు (80) ఆకస్మిక మృతి పట్ల మంగళవారం యానాం వర్తక సంక్షేమ సంఘం ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేసారు. సుబ్బారావు మృతికి సంతాప సూచకంగా వర్తకులు తమ షాపులను మూసివేసారు. అనంతరం సుబ్బారావు మృతదేహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘ అధ్యక్షుడు నల్లా వెంకన్న, కాపగంటి గోపాలకృష్ణ, నల్లం రాము, వివిధ వస్త్ర తదితర దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

యువత రక్తదానం

అమలాపురం రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండలంలోని రంగాపురంలో సిద్ధార్థ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 20 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరమట శ్యామ్ కుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు మొసలి స్వర్ణన్ రాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

అమలాపురం టౌన్: అంబేడ్కర్ జయంత్యుత్సవాల సందర్భంగా స్థానిక సావరంలో సోమవారం రెండు వర్గాలకు చెందిన వారు కొట్లాటకు దిగారు. ఈ ఘటనకు బాధ్యులైన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు మంగళవారం తెలిపారు.

ఉపాధికి వృత్తి నైపుణ్య శిక్షణ దోహదం

యానాం: వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు కళాశాల స్థాయి విద్యార్థుల ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు ఎంతగానో దోహదపడతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జాతీయ విద్యావిధానం–2020లో భాగంగా అటల్ ఇంక్యుబేషన్ సెంటర్, పుదుచ్చేరి ఇంజనీరింగ్ కళాశాల ఫౌండేషన్, పరిశ్రమల కేంద్రం, పాండిచ్చేరి హయ్యర్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత డిగ్రీ కాలేజీలో 3 రోజులపాటు కొనసాగే వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. పాండిచ్చేరి ఇంజనీరింగ్ కళాశాల ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, నిర్వాహకుడు వి విష్ణువర్ధన్, అధ్యాపకులు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదానం

- 'కోనసీమ ఆహార నిధి' ప్రతినిధుల వితరణ



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అన్నదానం చేస్తున్న డాక్టర్ శంకరరావు తదితరులు

అమలాపురం టౌన్: ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ స్ఫూర్తితో ప్రారంభించిన కోనసీమ ఆహార నిధి సంస్థ స్థాపించిన ఏడేళ్లలో తమ వంతు పేదలకు అన్నదానాలు చేస్తూ వస్తున్నామని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ అన్నారు. సంస్థ 7వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో ఆస్పత్రి రోగులు, వారి బంధువులు, పేదలకు మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు ప్రారంభించి కోనసీమ ఆహార నిధి సంస్థ సేవలను కొనియాడారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు, సామాజిక కార్యకర్త వలవల శివరావు, ఆహార నిధి సంస్థ ప్రతినిధులు గట్టిం వీరు, పోలిశెట్టి పవన్ మహేష్, వెదుళ్లపల్లి అయ్యప్ప, చీకట్ల కిరణ్, కుసుమ శ్రీను, దోసూరి కాశి, రోళ్ల హనుమంతరావు తదితరులు పేదలకు స్వయంగా ఆహార పదార్థాలు వడ్డించారు.

జీజీహెచ్ పనితీరుపై ఎమ్మెల్యే అశోక్ అసంతృప్తి



పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి వైద్య సిబ్బంది పనితీరుపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన ఆయన కార్యాలయంలో రోగి కల్యాణ్ సమితి (ఆర్‌కేఎస్) ప్రాజెక్టు ద్వారా జీజీహెచ్‌లో చేపట్టాల్సిన అత్యవసర పనులపై వైద్యశాఖ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మార్చురీ విభాగంలో ప్రస్తుతం రెండు బెడ్లు మాత్రమే ఉన్నాయని 15 ఏళ్లుగా ప్రతిపాదనలు పంపినప్పటికీ ఉన్నతాధికారులు స్పందించడం లేదని వైద్యులు తెలపడంతో ఎమ్మెల్యే అశోక్ స్పందించి తక్షణం మరో రెండు బెడ్లు ఏర్పాటు చేయాలనిఆదేశించారు. స్పెషలిస్ట్ వైద్యుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయాలని, మత్తు వైద్యుడ్ని నియమించాలన్నారు. ఐసీయూ విభాగంలో ఆక్సిజన్ సరఫరా పనులు వేగవంతంచేసి ఆపరేషన్ థియేటర్‌ను అందుబాటులో తీసుకురావాలని సూచించారు. అంబులెన్స్‌లను సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జీజీహెచ్ డీడీ టి.రవిశంకర్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె రామకృష్ణ, విద్యుత్ ఏఈ మూర్తి, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

యానాం: విద్యార్థులు ఇతర వ్యాపకాలను పక్కన పెట్టి చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులకు సైతం ఉచిత పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకర్, ప్రిన్సిపాల్ రత్నప్రభ, లైబ్రేరియన్ గుడాల కల్యాణి, అధ్యాపకులు నటరాజ్, భానుప్రసాద్, పీఈటీ పాలికి ప్రకాష్(స్వామి), ఇన్‌చార్జి హెచ్‌ఎం సుందరి, హంసాని రామలక్ష్మణుడు, రామచంద్ర పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మందార కాలువలో ఉపాధి పనులు

తాళ్లరేవు: మండల పరిధిలోని మూడు గ్రామ పంచాయతీల్లో ఊట నీరు దిగేందుకు ప్రధాన ఊటకాలువగా ఉన్న మందాల కాలువలో రూ.6.66 లక్షల విలువైన ఉపాధి పనులు చేస్తున్నట్లు సర్పంచ్ పంపన రామకృష్ణ తెలిపారు. ఈ పనిలో సుమారు 250 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు రామకృష్ణంరాజు, స్థానిక నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్ మణి పాల్గొన్నారు.

పాల్ ల్యాబ్ పరిశీలన

ముమ్మిడివరం: ఠానేల్లంక ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాలల్లో పాల్ ల్యాబ్ (పర్సనలైజ్డ్ అండ్ అడాప్టర్ లెర్నింగ్ ల్యాబ్)ను సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు పాల్ ల్యాబ్ డిస్ట్రిక్ట్ నోడల్ అధికారి కె.నారాయణరావుతో కలసి మంగళవారం పరిశీలించారు. జిల్లాలో ఇప్పటికే 31 పాఠశాలల్లో పాల్ ల్యాబ్‌లున్నాయని, కొత్తగా ఏపీ సోషల్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. పాల్ ల్యాబ్ చేపట్టిన పనులు, నిర్వహించే విధానాన్ని ప్రిన్సిపాల్ టి.గంగాభవాని, పాల్ ల్యాబ్ కోఆర్డినేటర్ అన్నపూర్ణ వివరించారు. సైన్స్ ఎక్స్‌పోలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

వైభవంగా ముత్యాలమ్మవారి తీర్థం

తాళ్లరేవు: సుంకరపాలెం గ్రామదేవత ముత్యాలమ్మవారి తీర్థం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ట్రస్ట్ చైర్మన్ సుంకర సూర్యనారాయణ, ప్రతినిధులు సుంకర బద్రి, కొండబాబు, గిరి పర్యవేక్షణలో అమ్మవారి జాతర మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు తమ మొక్కులు చెల్లించారు. మాగాపు చిన్న అప్పారావు కుటుంబ సభ్యులు అమ్మవారికి గరగను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీను, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, నాయకులు పాల్గొన్నారు.

పాలగుమ్మిలో తోటలమ్మవారి జాతర

అమలాపురం రూరల్: పాలగుమ్మి గ్రామదేవత తోటలమ్మవారి జాతరను సోమవారం రాత్రి గరగ నృత్యాలు, గారడీ నృత్యాలతో ఘనంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి పుట్టింటి వారైన పాలగుమ్మి కుటుంబీకులు ఎంపీటీసీ పాలగుమ్మి విజయవాసు దంపతులు, శ్రీనివాసరావు, పళ్ళంరాజు, చక్రపాణి గృహాల నుంచి గ్రామస్తుల సమక్షంలో వడికట్టు కట్టి మేళతాళాలతో సంబరాలు నిర్వహించారు. మట్టపర్తి గంగారామ్ రచించిన తోటలమ్మ అమ్మవారి చరిత్ర పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు గ్రామంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఆలయ ధర్మకర్త గణేశుల వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో సౌభాగ్య వ్రతం నిర్వహించారు. శ్రీవారి ఉత్సవ విగ్రహాలను అభిషేకించారు. స్వామికి చక్రస్నానం నిర్వహించారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ 41 గ్రామాలకు చెందిన 1000 మంది మహిళలతో లక్ష సార్లు గోవింద నామార్చన, 108 గోవింద నామాలను సంకీర్తన చేశారు. భజన గురువు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యకమం నిర్వహించారు.